క్లుప్తంగా

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థినులకు నగదు బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం హలీంసిద్ధిఖీ

ఆదోని సెంట్రల్: స్థానిక నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు హెచ్‌ఎం హలీంసిద్ధిఖీ చేతులమీదుగా నగదు బహుమతులను అందజేసినట్లు మెంటార్ సుధాకర్‌బాబు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి బహుమతి మహేశ్వరికి రూ.1000, రెండో బహుమతి రూ.750 వైష్ణవికి, మూడో బహుమతి రూ.500 అరుణ, కన్సోలేషన్ బహుమతి ఈశ్వరి కి రూ.250 అందించడం జరిగిందన్నారు.

25 నుంచి ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర శిక్షణ తరగతులు

ఆదోని సెంట్రల్: కడపలో ఈనెల 25, 26, 27వ తేదీల్లో జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి యు.దస్తగిరి, కోశాధికారి శేఖర్, నాయకులు వినయ్, ప్రభాకర్‌రెడ్డి, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆదోని రూరల్: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలతో కలిసి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రామాంజనేయులు, సీఐటీయూ మండల అధ్యక్షుడు జె.రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఆదోనిలోనే ఇవ్వాలి

ఆదోని అర్బన్: అమరనాథ్ యాత్ర కోసం వెళ్లే భక్తులకు డాక్టర్ ఇచ్చే ఫిట్‌నెస్, హెల్త్ సర్టిఫికెట్‌ను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని భక్తుడు శ్రీనివాస్ ఆచారి సోమవారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జూలై 3వ తేదీన అమరనాథ్‌యాత్ర ప్రారంభం కానున్నదని, యాత్ర కోసం వెళ్లే భక్తులు కర్నూలు జనరల్ ఆసుపత్రిలో ఫిట్‌నెస్, హెల్త్ సర్టిఫికెట్లు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.

డీఎస్సీలో పర్సంటేజీ నిబంధన తొలగించాలి

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో పర్సంటేజ్‌ల నిబంధన తొలగించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఖజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2025 నోటిఫికేషన్‌లో ఎస్జీటీలో ఇంటర్‌లో 50శాతం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీలలో 50 శాతం, పీజీటీ పోస్టులకు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు ఉండాలని నిబంధన విధించడం దారుణంగా ఉందన్నారు. నాయకులు మోహన్, రాజేష్, రవి, వీరేంద్ర పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



హోంగార్డు భార్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు మునిస్వామి కుటుంబానికి సబ్ డివిజన్ హోంగార్డులు అందరూ కలిసి సోమవారం సాయంత్రం టౌన్ సీఐ వి. శ్రీనివాసులు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. సీఐ మాట్లాడుతూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు మునిస్వామి కుటుంబానికి తోటి హోంగార్డులు అండగా నిలవటం అభినందనీయమన్నారు. హోంగార్డులు అందరూ కలసి సేకరించిన రూ.38 వేలను మునిస్వామి భార్య నాగమునేమ్మకు అందజేశారన్నారు. టౌన్ ఎస్ఐ మధుసుధన్‌రెడ్డి, సబ్ డివిజన్ హోంగార్డులు తదితరులు ఉన్నారు.

కిరాణా షాపులో అగ్ని ప్రమాదం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఫారూక్‌కు చెందిన కిరణాషాపులో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రూ.50 వేల నగదు, సామగ్రి కాలి బూడిదయ్యాయని షాపు యజమాని వాపోయాడు.

చెరువు మట్టితో భూసారం

- నేలలో సారం తగ్గితే చీడపీడల బెడద
- పంట నాణ్యతపై ప్రభావం
- రసాయన ఎరువులను విరివిగా వాడుతున్న రైతులు
- చెరువు మట్టిలో పోషకాలు
- మొక్కల పెరుగుదలకు ఉపయోగకరం



పొలంలో వేసిన చెరువు మట్టి



ట్రాక్టర్‌తో పొలంలో వేస్తున్న చెరువు మట్టి

గోనెగండ్ల: పంటల సాగులో ప్రధాన భూమిక భూసారానిదే. భూమిలో సారం ఉంటేనే దిగుబడులు ఆశించిన మేరకు వస్తాయి. భూసారం తగ్గితే తెగుళ్ల పురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది. అలాగే పెట్టుబడులు పెరగడంతో పాటు పంట నాణ్యత తగ్గుతుంది. వీటిని తట్టుకోవడానికి భూసారం అవసరమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భూమిలో పోషకాల పెరుగుదలకు రైతులు విరివిగా రసాయన ఎరువులు వాడుతున్నారు. దీని వల్ల భూసారం మరింత తగ్గుతుందని పేర్కొంటున్నారు. భూసారం పెరిగేందుకు పొలంలో చెరువు మట్టి వేయాలని సూచిస్తున్నారు.

చెరువు మట్టితో మినరలైజేషన్

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 42వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. సాధారణంగా మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో భూసారం తగ్గుతోంది. అలాగే భూమి తమ స్థితిని కోల్పోయి తేమ శాతం తగ్గుతుంది. దీని వల్ల పంట దిగుబడి తగ్గడంతోపాటు నాణ్యత కూడా లోపించే అవకాశం ఉంది. చెరువు పూడిక మట్టితో భూమి నాణ్యత, తేమను నింపుకొనే శక్తి పెరుగుతుంది. నీటి వినియోగ సామర్థ్యంతో పాటు భూమిలోని సారం పెరగడానికి ఉపయోగపడుతుంది. మట్టి పీహెచ్ తగ్గి సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పోటాష్, సూక్ష్మ పోషకాలు పెరిగి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది. సేంద్రియ కర్బనం ఎక్కువగా ఉంటే మినరలైజేషన్ జరిగి మొక్కల పెరుగుదల ఉంటుంది. చెరువు మట్టితో పాటు పెండ ఎరువు, కోళ్ల పెంట పంటలో వేసుకోవాలి. దీంతో భూమి గుల్ల బారి భూమిలో వేరు వ్యవస్థ బాగా పెరిగి మొక్కల ఎదుగుదలకు దోహదపడుతుంది.

> కిలో చెరువు మట్టిలో ఉండే పోషకాలు
> (మిల్లీ గ్రాముల్లో)
> నత్రజని-720, భాస్వరం- 35, పొటాష్- 310, కర్బనం- 0.5, జింక్- 1.8, బోరాన్- 0.8, గంధకం- 18, మేలుచేసే సూక్ష్మజీవుల సాంద్రత-308 గ్రాములు ఉంటుంది.

కూరగాయల సాగులో ఇలా..

టమాటో, బెండ, వంకాయ తదితర పంటల సాగులో అధిక దిగుబడుల కోసం ఎరువుల వాడకం ఎక్కువగా ఉంది. దీనితో పెట్టుబడులు విపరీతంగా పెరుగుతున్నాయి. కూరగాయలు సాగుచేసే పొలాల్లో ఎకరానికి 8నుండి 10 ట్రాక్టర్ల చెరువు మట్టిని ఆఖరి దుక్కిలో వేసుకొని కలియదున్నితే మంచి నాణ్యత గల పంట పండుతుంది. పెట్టుబడి కూడా తగ్గుతుంది. అంతేకాకుండా భూమిలో తేమ శాతం తగ్గకుండా ఉంటుంది.

పండ్ల తోటల్లో వేరు వ్యవస్థకు బలం

మామిడి, జామ, బత్తాయి వంటి పండ్ల తోటల్లో చెరువు మట్టి వాడకం వల్ల వేరు వ్యవస్థ బలంగా విస్తరించి ఏపుగా పెరుగుతాయి. దీనితో భూమిలో తేమను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది. పాదుల్లో చెరువు మట్టి మల్చింగ్‌లాగా ఉపయోగపడుతుంది. పండ్ల తోటలకు 5 నుంచి 6 ట్రాక్టర్లు చెరువు మట్టిని వేసుకోవాలి.

పొలానికి చెరువు మట్టి అవసరం



పొలాల్లో చెరువు మట్టి వేసుకుంటే భూమిలో భూసారం పెరిగి, భూమి నాణ్యతను తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది. ప్రస్తుతం పొలాల్లో పంటల లేక ఖాళీ వ్యవసాయ భూములు ఎక్కువగానే ఉంటాయి. భూమిలో భూసారం పెరగాలంటే చెరువు మట్టిని వేసుకుంటేనే మంచిది. చెరువు మట్టి వేసుకోవడం ద్వారా పోషకాలు పెరిగి అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

– మహమ్మద్ ఖాద్రీ, సహాయ వ్యవసాయ సంచాలకులు, ఎమ్మిగనూరు

పై తరగతులకు విద్యార్థుల ప్రమోట్

పెద్దకడబూరు : మండలంలోని 49 పాఠశాలల్లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులను రెండో తరగతికి, రెండు నుంచి మూడో తరగతికి ఇలా ఒక తరగతి నుంచిపై తరగతులకు విద్యార్థులను సోమవారం ప్రమోట్ చేసినట్లు మండల విద్యాధికారులు సువర్ణల సునీయం, రామమూర్తి తెలిపారు. వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎండకాలం సెలవులకు మూడు రోజులు ముందుగానే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. దీనివల్ల విద్యార్థులు పై తరగతిలో చదువుకోవడానికి అలవాటు పడతారన్నారు. అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న 5 ఏళ్లు నిండిన విద్యార్థులు, బడి బయట ఉన్న విద్యార్థులను కూడా ఒకటో తరగతిలో అడ్మిషన్ చేసుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు 5 సంవత్సరాలు పూర్తయిన చిన్నారులను ఒడిలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి, ఎమ్మార్సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ విద్యార్థులను 1వ తరగతిలో చేర్పిస్తున్న ఎంఈఓలు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



వీల్‌చైర్‌లో సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చినవృద్ధురాలి సమస్యనువింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) లక్ష్యమని, కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్‌ఎస్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా, డీఎల్‌డీఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీడీఎస్‌ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జీడీఎస్‌ల సంఘం జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి

కోసిగి: దేశవ్యాప్తంగా తపాలా శాఖలో పనిచేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల (జీడీఎస్) సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం కోసిగి గ్రామీణ తపాలా శాఖ కార్యాలయంలో జీడీఎస్ ఉద్యోగుల చైతన్య కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2.63లక్షల మంది జీడీఎస్ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. జీడీఎస్ కండక్ట్ ఎంగేజ్మెంట్ రూల్స్‌తో పై అధికారులు ఒత్తిడి చేస్తూ పని ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపించారు. జీడీఎస్ ఉద్యోగులందరికి రెగ్యులర్ చేయాలని, వేతనాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామన్నారు. కార్యక్ర మంలో కోసిగి మండల జీడీఎస్ ఉద్యోగులు గోపా ల స్వామి, జిలానీ బాషా, రాంప్రసాద్, పరుశురాముడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

పెద్దకడబూరు : ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ బి.రామమూర్తి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ఉన్న 8 0సీట్లుకు 271మంది విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారిలో ప్రవేశ పరీక్షకు 6మంది గైర్హాజరు కాగా మిగిలిన 265మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ రంగన్న, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఉన్నారు.

గోనెగండ్ల : ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ షాహీనా పర్వీన్ మాట్లాడుతూ ఆరవ తరగతిలో 80 సీట్లు ఉన్నాయని, ఇందుకు 297 మంది దరఖాస్తు చేసుకోగా, 288మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

'బోధన సక్రమంగా లేకనే తగ్గిన ఉత్తీర్ణత'

గోనెగండ్ల : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సక్రమంగా లేకనే పది ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిందని గోనెగండ్ల ఎంపీటీసీ రజియా సుల్తానా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ టి. నసురుద్దీన్ అధ్యక్షతన, ఎంపీడీఓ మణి మంజరి ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పాఠశాలలపై విద్యాశాఖ, మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు బడి మానేసి పనికి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని రజియా సుల్తానా ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అలువాల వెంకట్రామిరెడ్డి, కోఆప్షన్‌మెంబర్ రావూఫ్, ఈఓఆర్డీ అనంతసేన, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు జీతాలు ఇవ్వాలి

ఎంపీటీసీ సభ్యులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని గోనెగండ్ల మండల ఎంపీటీసీ సభ్యులు అలువాల వెంకట్రామిరెడ్డి, రజియా సుల్తానా కోరారు. ఈ మేరకు ఎంపీపీ టీ. నసురుద్దీన్, ఎంపీడీఓ మణి మంజారిలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సుధాకర్, మద్దయ్య, పుష్ప, ముద్దీరమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

గోనెగండ్ల : వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ విజయ భాస్కర్ సూచించారు. మండల పరిధిలోని గాజులదిన్నె గ్రామంలో సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహన దారులు రోడ్డు నిబంధనలు పాటించకుండా వెళ్లడంతోనే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కోసిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ అధికారులు

కోసిగి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఈశ్వరమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్లు భాగ్యలక్ష్మీ బాయి, కాత్యాయిని అన్నారు. సోమవారం కోసిగిలోని బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలతో కలిసి మండల స్థాయి పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందుగా ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలి



ప్రదీప్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కౌతాళం: పండుగలను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో ఏసు ప్రభువుపై సామాజిక డ్రామా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆదివారం రాత్రి పది గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు సంఘ పెద్దలకు రూ.20వేల రూపాయలను అందజేశారు. దానియేలు, కిష్టప్ప, ప్రతాప్, భాస్కర్ ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కోసిగి: మండల కేంద్రం కోసిగి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన ఈనెల 23న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలల కొకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు తప్పక హాజరు కావాలన్నారు. సమావేశం ఉదయం 10.45 గంటల ప్రారంభం అవుతుందని, అందురు సమయ పాలన పాటించాలని కోరారు.

పిల్లల ఆరోగ్యం కోసమే పోషణ్ పఖ్వాడా



పోషకాహారం గురించి గర్భిణులు, బాలింతలకు వివరిస్తున్న విజయకుమారి

పెద్దకడబూరు: పిల్లల ఆరోగ్యమే పోషణ్ పఖ్వాడా ముఖ్య ఉద్దేశమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. మండల కేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషన్ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీపేటలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల జీవితంలో మొదటి వెయ్యి రోజులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

కోసిగి: గ్రామాల్లో అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు హెచ్చరించారు. సోమవారం కోసిగి సర్కిల్ కార్యాలయంలో ఇటీవల ఓ పోక్సో కేసు నమోదు కాగా విచారణ నిమిత్తం వచ్చారు. ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. దూరపు ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకూడదన్నారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాలని సూచించారు. మహిళలు, బాలికలను చైతన్య పరిచేందుకు ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో 6 మందితో శక్తి టీమ్ బృందం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శక్తి టీమ్ మండలంలోని గ్రామ గ్రామానా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గుర్తు తెలియని వ్యక్తులు మహిళల పై అఘుత్యాలు, దాడులకు పాల్పడితే వెంటనే శక్తి యాప్ ద్వారా కానీ, 100 కాల్ చేస్తే వెంటనే పోలీసులు వచ్చి రక్షించే ప్రయత్నం చేస్తారని సూచించారు. ఇందులో సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హనుమాపురం గ్రామానికి చెందిన గొల్ల ఈరన్న(25) ఆదివారం సాయంత్రం పిడుగు పడి చనిపోయిన విషయం విధితమే. అదేవిధంగా మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామానికి చెందిన గడిగె ఆడివప్ప ఎమ్మిగనూరు ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్స్ షాప్ వద్ద చనిపోయిన విషయం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి తెలిసింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వై.ప్రదీప్‌రెడ్డి సోమవారం ఉదయం ఎమ్మిగనూరులోని ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం కోసం ఉంచిన మృత దేహాలను పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాలను కలసి ఒక్కో కుటుంబానికి రూ. 10వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఏమైనా సహాయం వస్తే త్వరగా అందేవిధంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పూజారి ఈరన్న, పెద్దయ్య, దేవదానము, నాగన్న, రఘు, ఉరుకుందు, యల్లప్ప, నరసన్న, వెంకటరాముడు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

ఆదోని రూరల్: మండంలోని పెద్దహరివాణం పాఠశాల విద్యార్థులకు సోమవారం ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను హెచ్‌ఎం ఇందిరాదేవి అందజేశారు. దసరా, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ తమ పాఠశాలలో పదో తరగతి ఒకేషనల్ విద్యార్థులకు ప్రత్యేక ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. 12 రోజులపాటు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశామన్నారు.

నందవరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను హెచ్‌ఎం శివరామ్ అందజేశారు. కార్యక్రమంలో వృత్తి విద్య కోర్సు ట్రైనర్లు శివకృష్ణ యాదవ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి దగ్ధం

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె వద్ద మిట్టసోమపురం గ్రామ రోడ్డులో సోమవారం విద్యుత్ తీగల షార్ట్ సర్క్యూట్‌తో వరిగడ్డి దగ్ధమైంది. గ్రామానికి చెందిన బండి కోట్టు రాముడి వద్ద కోడుమూరు మండలం ఎల్లిబండ గ్రామానికి చెందిన రైతు మద్దిలేటి రెండు ఎకరాల వరి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో ఎల్లిబండకు తరలిస్తుండగా.. విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించడంతో లిఫ్ట్ ఎత్తి గడ్డిని తొలగించారు. దాదాపు రూ.30 వేలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

భూ సర్వేలో అవకతవకలు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో ఇటీవల రెవెన్యూ అధికారులు చేపట్టిన రీ సర్వేలో అవకతవకలు జరిగాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ సీనియర్ నాయకుడు మద్దిలేటి నాయుడు ఆరోపించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గోనెగండ్లలో రీ సర్వే అనంతరం ఒక రైతు భూమి తక్కువ, మరో రైతుకు భూమి ఎక్కువ వచ్చాయన్నారు. ప్రతి రైతుకు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు తగ్గిపోయిందని చెప్పారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విష్ణుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బేతాళ పెద్ద బాషు, రాజశేఖర్ ఆచారి, నాగన్న, ఖాజబంద పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని చెప్పి నేడు అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మణి, రాజు, వెంకప్ప, ప్రసాద్, అఖండ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం



డ్రెనేజీ నిర్మాణం కోసం తవ్విన గుంత

కౌతాళం: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీకి కట్టుబడి మండల కేంద్రమైన కౌతాళంలోని ఉప్పర వీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టారు. ఉప్పర వీధిలో మురికి నీరు ఇళ్ల ముందు నిలబడి దుర్వాసన వెదజల్లుతున్న విషయాన్ని ఆ కాలనీ వాసులు ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సతీమని జయమ్మ దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ నిర్మాణం తప్పక పూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ ప్రహల్లదచారి సహకారంతో త్వరగా పూర్తి చేస్తామని బుజ్జిస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ సర్పంచ్ తిక్కయ్య తెలిపారు. డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దొరకడంతో ఉప్పరవీధి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.